# 7. అమర్నీతి నాయనారు

అమర్నీతి నాయనారు చోళరాజ్యమున ప్రసిద్ధినందిన పజైయ్యరాయికి చెందిన వైశ్య కులజుడు. ఆ గ్రామం చాలా సారవంతమైనది. చుట్టూ తోటలతో లతలతో పచ్చగా శోభాయమానంగా ఒప్పతూండేది.

అమర్నీతి నాయనారు బంగారం, రత్నాలు, పట్టు వస్త్రముల వ్యాపారి. విదేశాల నుండి వస్తువులను తెప్పించి వ్యాపారం చేస్తుండేవాడు. ఆయన ఆర్జన బహునీతిమంత ముగాయుండేది. వ్యాపారం కలిసిరావడంతో మంచి ధనవంతుడయ్యాడు. వ్యాపారము చేస్తున్నా, ఇహలోక వ్యాపకాలున్నా నాయనారు మనసు శివుని మీదే వుండేది. పరమశివ భక్తుడు. శివ భక్తులను తన గృహమునకు పిలిచి వారిని అర్చించేవాడు. వారలకు కౌపీనము, దుస్తులు మొదలగునవి ఇచ్చి, షష్టుగా భోజనము పెట్టి, ఏవైనా కానుకలు ఇచ్చి వారు సంతసించునట్లుగా చేసి సాగనంపేవాడు.

పండుగలలో పబ్బాలలో తిరునల్లూరు దేవాలయమునకు దైవదర్శనమునకు వెళ్లేవాడు. అక్కడ శివుని ముందు భావయుక్తంగా పంచాక్షరిని జపిస్తూ శివుని అర్చించే వాడు. కొన్నాళ్లకి పండుగలకు మాత్రమే తిరునల్లూరు దేవాలయమునకు వెళ్లటంతో సంతృప్తినందక - ఆ వూరిలోనే నివసించిన - నిరంతరము శివదర్శనము చేయవచ్చని శివభక్తుల సేవకు వీలవుతుందని తలచి - తిరునల్లూరుకు తన బంధువులతో సహా వెళ్లి అక్కడే స్థిరపడి - దైవదర్శనమునకు వచ్చేడి శివభక్తులకు వుండుటకు వీలుగా ఒక మఠం కట్టించాడు. ప్రతిదినము వారిని తన ఇంటికి పిలిచి వారలకు కౌపీనము మొదలగునవిఇచ్చి సంతసింపజేసేవాడు.

నాయనారు భక్తితత్పరతకు పరమశివుడు పరవశించి పోయాడు. ముఖ్యముగా కౌపీనముల నిచ్చుచుండుట, శివభక్తులయెడ వాత్సల్యము, ఔదార్యము శివుని ఆకర్షించి నవి. అతని ఔదారత్వాన్ని అందరిచేత ప్రశంసింపజేయాలని అతనికి తన శుభాశీస్సుల నియ్యటానికి శివుడు నిశ్చయించాడు.

అందుకని ఒకరోజున బ్రహ్మచారివేషంతో జటతో, విభూతి పుండ్రములు, భుజం మీద దండంతో శివుడు అమర్నీతియారు మఠంకి విచ్చేశాడు. బ్రహ్మచారి దండానికి చివర 2 కౌపీనములు, విభూతిసంచి కట్టబడి వున్నాయి. ఆయన ముఖం తేజోవం తంగా యుంది. కళ్లు ప్రకాశమానంగా వున్నాయి. ఠీవిగా మఠంలోకి ప్రవేశించాడు. అమర్నీతి యారు పరమానందంతో అతిథిని ఆహ్వానించి అర్చించాడు. బ్రహ్మచారి - అమర్నీతియారుతో " మీరు మహాత్ములు. ప్రతి ఒక్కరు మీదానాలకి ముఖ్యముగా కౌపీన ముల దానాలకు మిమ్ములను అభినందిస్తున్నారు.మీ దర్శనానికి వచ్చాను." అని అన్నాడు. అమర్నీతియారు - బ్రహ్మచారిని తన వద్దనుండి బిక్షను స్వీకరించవలసిందిగా అర్థిం చాడు. బ్రహ్మచారి ఒప్పకొని - "నేను నదికెళ్లి స్నానము చేసి నిత్యకర్మానుష్టానము చేసి వస్తాను. వర్షము వస్తోంది. వర్షముకు నా కౌపీనములు తడిసిపోయాయి. అందుకని ఈ పొడి కౌపీనమును జాగ్రత్త పరచండి. నేను వచ్చి తీసికొంటాను. అది చాలా విలు వైంది. ప్రత్యేకమైనది గూడ. అందుచే దానిని భద్రముగా యుంచండి" అని చెప్పి స్నానా నికి నదికి వెళ్లాడు.

బ్రహ్మచారి నదికి వెళ్లాడు. అమర్నీతియారు ఆ కౌపీనమును భద్రపరిచాడు. పర మశివుడు దానిని మాయం చేశాడు. బ్రహ్మచారి స్నానము చేసి వచ్చి తన పొడి కౌపీన మును ఈయమని కోరాడు. తన రెండో కౌపీనము వానకు తడిసిపోయింది. అందుకని పొడిదానిని అడిగాడు. అమర్నీతియారుకు తాను భద్రపరిచినచోట కౌపీనము కనిపించ లేదు. అంతటా వెదికాడు. ఎక్కడా కన్పించలేదు. అందుకని వణుకుతూ బ్రహ్మచారికి ఇం కొక కౌపీనముతో నిలబడి పరిస్థితిని చెప్పాడు. బ్రహ్మచారి నాయనారు మాటలను అంగీ కరించలేదు. వినలేదు. నాయనారు చాలాధనము దానిబదులు యిస్తానన్నాడు. బ్రహ్మ చారి "ధనాన్ని నేనేమి చేసికొంటాను అవసరం లేదు నా అవసరం కౌపీనము మాత్రమే" నన్నాడు. బ్రహ్మచారి ఇంకా అన్నాడు. "మీకు కౌపీనము కనిపించనిచో, నా ఇంకో కౌపీన మునకు సరితూగు వేరొక కౌపీనము నీయండి" అన్నాడు. అమర్నీతియారుకు కొంచెం స్వస్థత కలిగింది. వెంటనే త్రాసును తెప్పించాడు. బ్రహ్మచారి కౌపీనమును ఒక తక్కెటలో

ఉంచాడు. రెండో తక్కెటలో తాను ఇవ్వదలచిన కౌపీనమును పెట్టాడు. బ్రహ్మచారి కౌపీనమే ఎక్కువ బరువుచూపింది. అమర్నీతియారు ఏమిపెట్టినను బ్రహ్మచారి కౌపీనమే బరువుగా కన్పించిది. అమర్నీతియారుకు ఆశ్చర్యము కలిగింది. ఇదంతా శివలీలయని గ్రహించాడు. తన సంపదయావత్తు బ్రహ్మచారి కౌపీనమునకు సరితూగలేదు. పరమ శివుని కౌపీనము వేదమును తలపింపజేస్తుంది. దాని పోగులు శాస్త్రాలు.

అమర్నీతియారుకు పాలుపోలేదు. బ్రహ్మచారి కాళ్లమీద పడ్డాడు. "స్వామీ! నన్ను, నా భార్యను, నా పుత్రుని గూడ మీ కౌపీనమునకు సమమవుతాయేమో తూచండి" అని అర్థించాడు. బ్రహ్మచారి అంగీకరించాడు. అమర్నీతియారు తన కుటుంబముతో తక్కెటలో కూర్చుంటూ " నేను యథార్థంగా శివభక్తులను భక్తితో, చిత్తశుద్ధితో సేవించుచున్నట్లయితే, ఈ త్రాసు ఇప్పడు సరితూగుగాక" అన్నాడు. త్రాసు ఆశ్చర్యకరంగా సరితూగింది. అమర్నీతియారు పుణ్యం బ్రహ్మచారి కౌపీనమునకు తుల్యమయింది. అచ్చట చేరిన ప్రజలందరూ చకితులయ్యారు. వారు అమర్నీతాయారు పాదములపైబడి ప్రశంసించారు. దేవతలు ఆ కుటుంబముపై పారిజాత సుమ వృష్టికురిపించారు. బ్రహ్మచారి అంతర్ధానమైనాడు.పార్వతీపరమేశ్వరులు వృషభవాహనముపై ప్రత్యక్షమై నాయనారును అనుగ్రహించారు. పరమేశ్వరుడు అమర్నీతియారు నుద్దేశించుచు "నీ కౌపీన దాతృత్వము శివభక్తుల నిరుపమాన సేవ మమ్మల్ని అలరించింది. నీవు, నీ భార్య, పుత్రుడు ముగ్గురు నాలోకంలో శాశ్వతంగా నివసించండి" అన్నారు. శివానుగ్రహం వల్ల తక్కెడ దివ్యవిమానంగా మారి అమర్నీతియారును, భార్యను, పుత్రుని శివలోకానికి చేర్చింది.

****